సాక్షి చిత్తూరు
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని ప్రభుత్వం ఐదింతలు పెంచిందని మంత్రి ఆర్కే రోజా అన్నారు. - 8లో



పంటలపై గజరాజుల విధ్వంసం

బంగారుపాళెం, నదుం మండలాల్లోని పంట పొలాలపై గజరాజులు విరుచుకుపడి విధ్వంసం సృష్టించాయి. - 8లో



చిరు వ్యాపారులకు ఆసరా

కుప్పంలో చిరువ్యాపారుల ఏడాది గేట్ మొత్తాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి సొంత నిధులు చెల్లించి ఆసరాగా నిలిచారు. - 8లో

ఐదింతల ఆరోగ్య సిరి

'పేదల ఆరోగ్యమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. పేదలపాలిట సంజీవనిగా ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదింతలు పెంచి మరింత బలోపేతం చేశారు. ఈ పథకం కింద వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి 25 లక్షలకు పెంచారు' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షల వరకు పెంపు, కొత్త ఫీచర్ల ఆరోగ్య శ్రీకార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆరోగ్యశ్రీ విస్తరణ మెగా చెక్కును అందజేశారు.

- పేదల ఆరోగ్యమే సర్కారు ధ్యేయం
- 2019 నుంచి రూ.635.15 కోట్లతో 3,18,689 మందికి సర్జరీలు
- లబ్ధిదారులకు కొత్త ఫీచర్ల కార్డులు అందజేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- చిత్తూరులో ఘనంగా జిల్లా స్థాయి ఆరోగ్యశ్రీ కార్యక్రమం



నూతన ఫీచర్లు కలిగిన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే,కలెక్టర్, జెడ్పీ చైర్మన్

చిత్తూరు కలెక్టరేట్ : పేదల ఆరోగ్య పరిరక్షణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లె క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్స ఖర్చు పెంపు రూ.25 లక్షల వరకు, కొత్త ఫీచర్ల ఆరోగ్య శ్రీకార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. వర్చువల్ విధానంలో సీఎం ప్రసంగాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పేద వారికి ఉచితంగా వైద్యం అందిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్రం, పొరుగు రాష్ట్రాల కార్పొరేట్ ఆస్పత్రుల్లో దాదాపు 3200 జబ్బులకు ఉచితంగా వైద్యం అందించడంలో ఖర్చు పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచిందన్నారు. ఆరోగ్యశ్రీ ఆరోగ్య ఆసరా కింద రాష్ట్ర వ్యాప్తంగా ఏటా దాదాపు రూ.4,100 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. నాడు-నేడుతో ఆస్పత్రుల ఆధునీకరణ, వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించినట్లు వివరించారు. ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల, రిసెర్చ్ సెంటర్లను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం ఉన్న 11 మెడికల్ కళాశాలల ఆధునీకరణ, నిర్మాణంలో ఉన్న 17 మెడికల్ కళాశాల నిర్మాణాలకు రూ.32,279 ఖర్చు చేశారన్నారు.

ఆరోగ్య సురక్షలో ఫస్ట్

జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక వైద్య పరీక్షలు చేసిన జిల్లాల్లో చిత్తూరు ప్రథమ స్థానంలో ఉన్నట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. జనవరి 2 నుంచి ప్రారంభం కానున్న రెండవ విడత కార్యక్రమాన్ని అదే స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో 2019 నుంచి ఈ ఏడాది నవంబర్ నెల వరకు 3,18,689 మందికి సర్జరీలు నిర్వహించగా, ప్రభుత్వం రూ.635.15 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. శస్త్ర చికిత్స అనంతరం అందించే ఆరోగ్య ఆసరా ద్వారా 1,30,601 మందికి రూ.62.75 కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లాలో 4,73,877 ఆరో గ్యశ్రీ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. అనంతరం ఆరోగ్యశ్రీ పెంపు మెగా చెక్కును మంత్రి ఆవిష్కరించారు. నూతన ఫీచర్లు కలిగిన ఆరోగ్యశ్రీ కార్డులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, ఎమ్మెల్సీ భరత్, ఈడిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ కేజే శాంతి, కార్పొరేటర్ హరిణి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి, ఆరో గ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ సుదర్శన్, డీపీఓ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ విస్తరణ మెగా చెక్కును అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఆరోగ్యశ్రీలో కంటి ఆపరేషన్



నాకు రెండు కళ్లకు శుక్లాలు రావడంతో చూపు మందగించింది. జగనన్న దయతో ఆరోగ్యశ్రీ ద్వారా నెట్వర్క్ ఆస్పత్రిలో రెండు కళ్లకు ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్నాను. ఇప్పుడు కళ్లు చాలా బాగా కనిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం లేకుంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖర్చు భరించడం మా వల్ల అయ్యేది కాదు. సీఎం కు రుణపడి ఉంటాం.

– షేక్ మహమ్మద్ జలీల్ షరీఫ్, లబ్ధిదారుడు, చిత్తూరు

ఆసరా కూడా ఆదుకుంది



నేను తోపుడు బండిలో వ్యాపారం చేస్తుంటాను. గత 4 ఏళ్లుగా ముక్కు నొప్పితో బాధపడుతున్నా. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేసుకోవాలంటే ఎంత ఖర్చు అవుతుందో అని భయం. స్తోమత లేకపోవడంతో ఎలా అని ఆలోచిస్తున్న సమయంలో వలంటీర్ ఆరోగ్య శ్రీ పథకం గురించి చెప్పారు. ఉచితంగా చికిత్స చేయించుకోవడంతో పాటు, ఆరోగ్య ఆసరా కింద రూ.4500 ఇచ్చారు. పేదలకు సీఎం చేస్తున్న మేలు ఎన్నటికీ మరువలేనిది.

– అజీజ్, లబ్ధిదారు, చిత్తూరు

జగనన్న మేలు మరువం



మాది పేద కుటుంబం. ఇంటి పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాను. గుండె సమస్యతో బాధపడుతున్న నేను ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స చేయించుకున్నాను. జగనన్న దయతో రూ.లక్షల విలువ చేసే గుండె ఆపరేషన్ చేసుకున్నాను. ప్రస్తుతం నేను బాగున్నానంటే అందుకు కారణం జగనన్నే. ఆయన మేలును ఎప్పటికీ మరిచిపోను.

– సెల్వి,సత్యనారాయణ పురం,చిత్తూరు

న్యూస్‌రీల్

సీఎం పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: మండల కేంద్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈనెల 21వ తేదీన ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో భారీ సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మండలంలోని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు 9,276 మందికి చీరలు, వారి కుటుంబ సభ్యులకు ప్యాంట్, షర్ట్‌లు అందజేయనున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఏర్పాట్లను విజయానందరెడ్డి పరిశీలించారు. పది వేల మందికి పైగా జనం రానుండడంతో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని నాయకులకు ఆయన సూచించారు. నాయకులు మధుసుదన్‌రాయల్, గోర్ల హరిప్రసాద్, ప్రకాష్, రమేష్, గోపి, రవియాదవ్, జిజయ్, ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలకు ప్రాధాన్యం



బాధితుల సమస్యలు వింటున్న ఏఎస్పీలు

చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే సమస్యలపై నిర్లక్ష్యం వహించవద్దని, ప్రాధాన్యతతో వీటిని పరిష్కరించాలని చిత్తూరు ఏఎస్పీ సుధాకర్, ఎస్ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి ఆదేశించారు. సోమవారం చిత్తూరులోని ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో ఏఎస్పీలు ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. కుటుంబ తగాదాలు, వేధింపులు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలపై బాధితులు సమస్యలను విన్నవించారు. దీనిపై అధికారులు స్పందించి ఆయా స్టేషన హౌజ్ ఆఫీసర్లతో మాట్లాడారు. స్పందనలో వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారించాలన్నారు. స్పందనలో మొత్తం 31 ఫిర్యాదులు వచ్చినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు.

ఎంఈఓలకు ట్యాబ్‌ల అందజేత



ఎంఈఓలకు ట్యాబ్‌లు అందజేస్తున్న డీఈఓ కార్యాలయ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన బైజూస్ ట్యాబ్‌లు సోమవారం జిల్లాకు చేరాయి. డీఈఓ కార్యాలయానికి వచ్చిన ట్యాబ్‌లను ఏడీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఎంఈఓలకు పంపిణీ చేశారు. ఏడీ విలేకరులతో మాట్లాడుతూ మొదటి విడతలో 5,262 ట్యాబ్‌లు వచ్చాయని తెలిపారు. ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, గుణశేఖర్‌రెడ్డి, రమేష్, హెచ్ఎం సురేష్, డీఈఓ కార్యాలయ సిబ్బంది సుధాకర్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,845 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,122 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.44 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

డ్వాక్రాలో ఇక అంతా డిజిటల్

డ్వాక్రా సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా రుణ పరపతిని అధికారులు పెంచారు. వాణిజ్య బ్యాంకు నుంచి అందించే రుణాలే కాకుండా స్త్రీనిధి బ్యాంకు నుంచి వ్యక్తిగత రుణాలు అందుతాయి. స్త్రీనిధి రుణాల చెల్లింపులో సిబ్బంది చేతివాటంతో మహిళలు మోసాలకు గురవుతున్నారు. ఇలాంటి అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం రుణాల చెల్లింపుల్లో డిజిటల్ విధానానికి శ్రీకారం చుట్టింది.

- స్త్రీనిధి సొమ్ములో సిబ్బంది చేతివాటం
- రూ. లక్షల్లో మోసపోతున్న మహిళలు
- అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు
- జిల్లాకు 7 పేటీఎం మిషన్‌లు

చిత్తూరు అగ్రికల్చర్: స్త్రీనిధి బ్యాంకు రుణాల చెల్లింపుల్లో జరుగుతున్న చేతివాటానికి చెక్ పెట్టే విధంగా ప్రభుత్వం డిజిటల్ చెల్లింపుల విధానం ప్రారంభించింది. జిల్లాలో మొత్తం 35 వేల డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వారికి ఈ ఏడాదికి స్త్రీనిధి బ్యాంకు రుణాలు రూ.177 కోట్ల మేరకు అందించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రతి మహిళకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు రుణ పరపతిని ప్రభుత్వం పెంచింది. ఈ రుణాలు తీసుకున్న మహిళలు చాలామంది వాయిదా సొమ్మును నేరుగా కాకుండా యానిమేటర్లు, గ్రామ సమాఖ్య సహాయకులు (వీఓఏ), క్లస్టర్ కో ఆర్డినేటర్ (సీసీ)ల ద్వారా చెల్లిస్తుంటారు. ఇదే అదనుగా కొంతమంది సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో రూ. లక్షల్లో అవినీతి వెలుగు చూసింది. ఇటీవల చిత్తూరు మండలంలో మహిళా స్వయం శక్తి సంఘాల రుణాల వాయిదా సొమ్ము, పొదుపు, స్త్రీనిధి రుణాలను రూ 1.50 కోట్ల మేరకు సిబ్బంది స్వాహా చేయడంతో పోలీసు కేసు నమోదైంది. ఇలాంటి చేతి వాటానికి చెక్ పెట్టే విధంగా ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. ఇందుకో సం పేటీఎం సంస్థతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఒప్పందం చేసుకుంది.



జిల్లాలోని కార్వేటినగరం, కుప్పం, పెద్దపంజాణి, పూతలపట్టు, ఐరాల మండలాల్లో డిజిటల్ చెల్లింపులను ప్రయోగాత్మకంగా చేపట్టింది. ఇందు కోసం ఏడు పేటీఎం మిషన్‌లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ విధానం విజయవంతం కావడంతో త్వరలోనే జిల్లా వ్యాప్తంగా డిజిటల్ చెల్లింపు విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

చెల్లింపులు ఇలా..

స్త్రీనిధి రుణం పొందిన మహిళలు నెలసరి వాయిదా మొత్తాలను డిజిటల్ చెల్లింపులో భాగంగా రూపే కార్డు, ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే నుంచి చెల్లించవచ్చు. మొత్తం గ్రూపు సభ్యులంతా వాయిదా సొమ్మును యానిమేటర్ వద్ద ఉన్న పేటీయం యంత్రం ద్వారా చెల్లించవచ్చు. చెల్లింపు సమయంలో సంఘం ఐడీ నంబర్ ఎంటర్ చేస్తే ఆ గ్రూపునకు చెందిన రుణం ఖాతాలో జమ అవుతుంది. పేటీఎం నుంచి వచ్చే రిసీప్ట్‌లో గ్రూపు పేరు, ఐడీ ఇతర వివరాలు ఉంటాయి. ఈ విధానం ద్వారా మహిళలు చెల్లించాల్సిన వాయిదా సొమ్ములో చేతివాటానికి చోటు ఉండదు.

జిల్లా అంతటా అమలు చేస్తాం



స్త్రీనిధి రుణాల మంజూరులో రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో ఉంది. రుణాల చెల్లింపులో పలుచోట్ల సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు గుర్తించాం. దీంతో ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంది. త్వరలో అంతా అమలు చేస్తాం.

– తులసి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్

అవినీతికి తావుండదు



డిజిటల్ చెల్లింపుల ద్వారా అవినీతికి ఆస్కారం ఉండదు. ప్రతి మహిళ ఆయా గ్రామాల్లోనే పేటీఎం సాయంతో వాయిదా మొత్తాలను చెల్లించి రశీదు పొందవచ్చు. సకాలంలో చెల్లింపులు చేపట్టడం వల్ల అదనపు వడ్డీల భారం ఉండదు.

– వెంకటప్రకాష్, ఏజీఎం, స్త్రీనిధి బ్యాంకు

ప్రజలకు మరింత చేరువ కావాలి

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు
- సచివాలయ ఉద్యోగుల శిక్షణ ప్రారంభం



ప్రసంగిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: సచివాలయ ఉద్యోగులు మరింత మెరుగ్గా పని చేస్తూ ప్రజలకు చేరువ కావాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సీఎంఎస్ఎస్ శిక్షణ కేంద్రంలో జిల్లాలోని సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. జనవరి నెలఖరు వరకు జిల్లాలోని 4,056 మంది ఉద్యోగులకు సర్వీసురూల్స్‌పై 7 బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగం కోసం ఎంత కష్టపడ్డారో ఇప్పుడు కూడా అలాగే పనిచేయాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి చిన్నపనికి ప్రజలు సచివాలయాల గడప తొక్కుతున్నారన్నారు. ప్రొబేషన్ పీరియడ్ గడువు ముగియడంతో ఇప్పుడు అందరూ రెగ్యులర్ ఉద్యోగులని, సర్వీసు రూల్స్, నవరత్నాలు, ఆన్‌లైన్ అప్‌డేషన్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ, రక్షణ, సంక్షేమ, ఇంజినీరింగ్, ఆరోగ్యం ఇలా పలు శాఖ కార్యదర్శులు చురుకుగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికీ నవరత్నాలు అందే విధంగా పని చేయాలని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం సచివాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పథకాల అర్హతలను లబ్ధిదారులకు అర్థమయ్యేవిధంగా చెప్పాలన్నారు. వర్షాలు పడుతున్న సమయంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. గర్భిణులకు ఆరోగ్య సేవలు అందించాలన్నారు. రైతులకు పంట జాగ్రత్తలు తెలియజేయాలని, అన్ని రకాల సేవలను మరింత బలోపేతం చేయాలని వివరించారు. కార్యక్రమంలో టీసీఐఎల్ జిల్లా ఇన్‌చార్జి లలితమ్మ, డీఎల్‌డీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి ఇంద్రానగర్ గ్రామస్తులు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్

కుప్పం రూరల్: కుప్పం ఇంద్రానగర్‌కు చెందిన 20 కుటుంబాల వారు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. దశాబ్దాలుగా రోడ్డు వేయండి మహాప్రభో అని కోరుతున్నా తమ గోడు ఎవరూ పట్టించుకోలేదని, తాము నివేదించిన వెంటనే సమస్యను పరిష్కరించి తమ గ్రామానికి తారురోడ్డు వేసిన ఎమ్మెల్సీ భరత్‌కు రుణపడి ఉంటామని ఇంద్రానగర్ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నూతన తారురోడ్డును ఎమ్మెల్సీ ప్రారంభించడంతో గ్రామస్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇకపై తాము వైఎస్సార్ సీపీకే మద్దతు ఇస్తామని, గ్రామంలోని 20 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఎమ్మెల్సీ భరత్ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పెరుమాళ్, కన్నప్ప, ఆర్ముగం 20 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూహక్కుల సవరణ చట్టాన్ని రద్దు చేయండి



న్యాయవాదుల వినతిని పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ భూహక్కుల చట్టం సవరణ చట్టం రద్దు చేయాలని నగర న్యాయవాదుల సంఘం సెక్రటరీ అశోక్ ఆనంద్ కోరారు. సోమవారం ఆ సంఘ నాయకులు కలెక్టరేట్ లో మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సెక్రటరీ మాట్లాడుతూ ఏపీ భూహక్కుల చట్టం యాక్ట్ 27 (2023)తో పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లితుందని తెలిపారు. ఈచట్టం అమలు పై పున:పరిశీలన చేయాలని కోరారు. న్యాయవాదులు విశ్వనాథ్, కృష్ణకిశోర్, నళిని, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

స్పందన రద్దు అయినా.. విచ్చేసిన ప్రజలు



వినతులు పరిశీలిస్తున్న డీఆర్ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన రద్దు అయినప్పటికీ పలు ప్రాంతాల నుంచి సోమవారం ప్రజలు కలెక్టరేట్‌కు విచ్చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డీఆర్ఓ రాజశేఖర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఆయా వినతులను సంబంధిత శాఖల అధికారులు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని డీఆర్ఓ ఆదేశించారు. ఏఓ కులశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రుణాల పేరిట మోసం చేశాడని ఫిర్యాదు

చిత్తూరు అర్బన్: రుణాలు ఇప్పిస్తామంటూ తమను మోసం చేశాడని గంగాధరనెల్లూరు మండలం, వీరకనెల్లూరుకు చెందిన డ్వాక్రా మహిళలు సోమవారం చిత్తూరులో ఏఎస్పీ శ్రీలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ తమకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల రుణాలు ఇప్పిస్తామని, ఒక్కో మహిళ నుంచి రూ.10 వేలు చొప్పున వసూలు చేసి పారిపోయాడని తెలిపారు. ఇతనిపై చర్యలు తీసుకుని, తమ నగదు ఇప్పించాలని కోరారు. దీనిపై ఏఎస్పీ విచారణకు ఆదేశించారు.

చిరు వ్యాపారులకు ఆసరా

కుప్పం మున్సిపాలిటీలో గేటు వసూలు మొత్తం చెల్లించి చిరు వ్యాపారులకు రాజంపేట ఎంపీ, లోకసభ ప్యానల్ స్పీకర్ ఎంపీ మిథున్‌రెడ్డి ఆపన్నహస్తం అందించారు. రోడ్డుపై దుకాణాలు నడుపుకుంటు జీవనం సాగిస్తున్న వారి గేటు వసూలు కష్టాలకు చరమగీతం పాడుతూ మున్సిపాలిటీకి ఏడాది మొత్తం రూ.75 లక్షలను స్వయంగా చెల్లించారు. గేటు వసూలను మున్సిపాలిటీ రద్దు చేయడంతో చిరు వ్యాపారుల ఆనందాలకు హద్దులేకుండా పోయింది.

- కుప్పంలో గేట్ వసూలు రద్దు
- ఏడాది మొత్తం రూ.75 లక్షలు చెల్లించిన ఎంపీ మిథున్‌రెడ్డి
- ఆనందం వ్యక్తం చేస్తున్న చిరు వ్యాపారులు



కుప్పంలో వీధి దుకాణాలు

కుప్పం : పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా చిల్లర దుకాణాలు నడుపుతూ జీవనం సాగించేవారే అధికం. గేటు(దుకాణాల అద్దె) వేలం దక్కించుకుని వారు ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడేవారు. వ్యాపారసులు భయభ్రాంతులకు గురయ్యేవారు. రోజూ రూ.వందల్లో గేటు ఇవ్వాలని డిమాండ్ చేసేవారు. అడిగినంత ఇవ్వకుంటే వ్యాపారాలకు అడ్డుపడేవారు. గేటు వసూళ్ల అరాచకాలను చిరు వ్యాపారులు గతంలో కుప్పంలో పర్యటించిన ఎంపీ మిథున్ రెడ్డికి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన చిరు వ్యాపారుల వివరాలపై ఆరా తీశారు. సుమారు 2వేల మందికి పైగా చిరు వ్యాపారులు ఉన్నట్లు తెలుసుకున్నారు. వారి కష్టాలను తీర్చే విధంగా ఏడాది పాటు మున్సిపాలిటీ గేటు మొత్తం చెల్లించి వారికి ఆసరా ఇచ్చారు. తమకెంతో మేలు చేసిన ఎంపీ మిథున్‌రెడ్డికి తాము రుణపడి ఉంటామని వ్యాపారులు పేర్కొంటున్నారు.

21న గుర్తింపు కార్డులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈనెల 21వ తేదీన చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. గుర్తింపుకార్డు ఉన్న వ్యాపారస్తులకు గేటు వసూలు రద్దు చేస్తున్నట్లు మున్సిపాలిటీలో తీర్మానించారు. దీంతో చిరు వ్యాపారస్తులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ఈనెల 21 మున్సిపల్ కార్యాలయంలో కార్డులు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

దౌర్జన్యాలను తట్టుకోలేక పోయాం



గేటు వసూలుదారుల దౌర్జన్యాలు తట్టుకోలేక పోయాం. రోజూ రూ.50 ఉన్న గేటు 100కు పెంచారు. జరిగే వ్యాపారమే అంతంత. అందులో రూ.100 కడితే కూలి కూడా గిట్టుబాటు అయ్యేది కాదు. గేటు చెల్లింపు బాధను ఎంపీ మిథున్ రెడ్డి తొలగించారు. ఆయన చల్లగా ఉండాలి

శ్రీరాములు, చిల్లర వ్యాపారి, కొత్త పేట

ఎంపీకి రుణపడి ఉంటాం



రోజంతా రోడ్డుపై ఆకుకూరలు అమ్మితే రూ.100, 200 వందలు వస్తుంది. దీన్ని గేటు వాళ్లకు కట్టేసే దాన్ని. మా కష్టాలను ఎంపీ మిథున్‌రెడ్డి తీర్చారు. ఇప్పుడు గేటు కట్టేపని లేకుండా చేశారు. రోజూ సంతోషంగా వ్యాపారం చేసుకుని ఇంటికి వెళుతాం. ఎంపీకి రుణపడి ఉంటాం.

మునెమ్మ, గుల్లేపల్లె

టీ అమ్మితే కూడా గేటు



సైకిల్‌పై టీ అమ్మితే కూడా గేటు వసూలు చేసేవారు. సైకిల్ తొక్కి రోజంతా కష్టపడినా ఆదాయం వచ్చేది కాదు. గేటు వసూలను ఎంపీ రద్దు చేయడం చాలా సంతోషంగా ఉంది. పేదోళ్ల బాధలు అర్థం చేసుకున్న ఎంపీ మేలును వ్యాపారస్తులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు.

ఖాదర్, టీ వ్యాపారి, కుప్పం

చిర వ్యాపారస్తులు బాధలు తీర్చాం



చిరు వ్యాపారాలు చేసే వారి బాధలు చూసి చలించి పోయాం. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి సహకారం ఎమ్మెల్సీ భరత్ ప్రోత్సహంతో ఈవిషయాన్ని ఎంపీ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఆయన మంచి మనస్సుతో గేటు రద్దు చేయమన్నారు. మున్సిపాలిటీకి నష్టం రాకుండా గేటు వసూలు మొత్తాన్ని ఆయనే చెల్లించారు.

డాక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్మన్

బడుగుల అభ్యున్నతి గిట్టని చంద్రబాబు

- బాబు హయాంలో ఆరోగ్యశ్రీ బిల్లుల పెండింగ్
- పేదలకు అండగా సీఎం జగనన్న
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చంద్రబాబు నాయుడు పూర్తి వ్యతిరేకి అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తీవ్రంగా విమర్శించారు. సోమవారం పుత్తూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి వ్యతిరేకి అని, వారి ఎదుగుల ఆయనకు గిట్టదన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించడంలో తన హయాంలో చంద్రబాబు అసమర్థుడిగా నిలిచారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3,257 వ్యాధులను ఆర్యోశ్రీలో చేర్చి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఇందులో ఆరోగ్య ఆసరా కింద 1,519 వ్యాధులను చేర్చారని గుర్తు చేశారు. గతంలో రూ. 5లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీని నేడు రూ.25 లక్షలకు పెంచి ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు అన్ని సామాజిక వర్గాల్లోని పేదలకు పెద్ద దిక్కుగా నిలిచారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకునేందుకు ఆరోగ్యశ్రీ విస్తరింపజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఏడాదికి రూ.1,034 కోట్లు ఖర్చుపెట్టగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.4,100 కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రిలో చేరిన రోగికి రోజుకు రూ.225 చెల్లిస్తున్న ఘనత కూడా జగనన్నదేనని అన్నారు.

చంద్రబాబును నమ్మితే నట్టేట మునిగినట్లే

చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, ఎల్లో మీడియా కలసి అభివృద్ధి పథకాలపై విషప్రచారం చేయడం సమంజసం కాదన్నాదన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కులాలను రెచ్చగొట్టి, తమ సామాజిక వర్గం కోసం పోరాటం చేస్తున్నారని ఆరోపించారు. కమ్మ సామాజిక వర్గంలో పేదలు కూడా అన్ని సంక్షేమ పథకాలను అందుకుంటున్నారని, వారు కూడా బాబును అసహ్యించుకునే రోజులు దగ్గర పడుతున్నాయని హెచ్చరించారు. ఎస్సీ ప్రజాప్రతినిధులు వెళ్లిన రోడ్లపై పసుపునీరు, పేడ చల్లి శుద్ధి చేయిస్తున్న చంద్రబాబును నమ్మి ఎమ్మెల్యే టికెట్ల కోసం వెళుతున్న టీడీపీ వెనుకబడిన తరగతుల నాయకులకు అవమానం తప్పదన్నారు. సీఎం జగనన్న అంబేడ్కర్ భావజాలాలు కలిగి ఉన్నారని, విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

విశ్వనాథ్‌కు ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు



అవార్డుతో డాక్టర్ ద్వారక విశ్వనాథ్

పలమనేరు: పట్టణానికి చెందిన డాక్టర్ ద్వారక విశ్వనాథ్‌కు పాండిచ్చేరికి చెందిన ప్రభుత్వ గుర్తింపు సంస్థ నావల్ రీసెర్చ్ అకాడమీ ఉత్తమ యువ శాస్త్రవేత్త అవార్డు ప్రదానం చేసింది. భౌతిక శాస్త్రంలో ఆయన చేసిన పరిశోధన వ్యాసాలు ఇంటర్నేషన్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. వీటి ఆధారంగా ఈ అవార్డు దక్కింది. ఎస్వీయూలో ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన ఆయన డీఆర్‌డీవో(డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు)లో జూనియర్ రీసెర్చ్‌ఫెలోగా పనిచేశారు. భారత మిలటరీకీ అవసరమైన శక్తివంతమైన లేజర్స్‌ను తయారు చేయడమే తన లక్ష్యమని ఆయన తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు బాధ్యతను మరింత పెంచిందన్నారు. స్థానిక మదర్‌థెరీసా కళాశాల యాజమాన్యం రవీంద్రబాబు, సునీల్, రాజేంద్రరెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

రేపు చంద్రగిరిలో మెగా జాబ్ మేళా



చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం వైఎస్సార్ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మేళాలో 33 మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 3,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచన మేరకు జాబ్‌మేళాకు విచ్చేసే అభ్యర్థులకు పకడ్బందీగా సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. పదోతరగతి నుంచి ఇంటర్, బీటెక్, ఎంబీఏ విద్యార్హత కలిగినవారు మేళాకు హాజరుకావచ్చన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాకు అర్హులందరూ ధ్రువీకరణ పత్రాలతో రావాలని సూచించారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఏర్పేడు : మండలంలోని సదాశివపురంలో సోమవారం ఓ వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. గ్రామానికి చెందిన భూ చంద్రనాయుడుతో సుబ్బమ్మ, లోకేష్‌కు ఓ ఇంటి స్థలం విషయంలో వివాదం ఏర్పడింది. దీంతో వారు భూచంద్రనాయుడిపై దాడి చేశారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలి.. పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలి.. ప్రాణాంతక వ్యాధి బారిన పడినవారి జీవితాలకు సైతం భరోసా కల్పించాలి.. పైసా ఖర్చు లేకుండా ప్రతి ఒక్కరూ నాణ్యమైన సేవలు పొందాలి.. ఆస్పత్రుల్లో చికిత్స కోసం ఎవరూ ఆస్తులు అమ్ముకోవాల్సిన అవసరం లేకుండా చేయూతనందించాలి.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నతంగా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు మంత్రి ఆర్‌కే రోజా వెల్లడించారు. అందులో భాగంగానే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరమితిని ఐదింతలు చేసినట్లు వివరించారు.

- ప్రజారోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యం
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో మరింత భరోసా
- రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పరిమితి పెంపు
- పేదల పాలిట సంజీవనిగా అభివర్ణించిన మంత్రి రోజా
- యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచన



నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో మంత్రి ఆర్కే రోజా, కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

తిరుపతి అర్బన్ : వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు పాలిట సంజీవని అని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా తాడేపల్లె క్యాంపు కార్యాలయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం మంత్రిరోజా, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీఎంహెచ్ఓ శ్రీహరి తదితరులు ఆరోగ్యశ్రీ నూతన కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ విద్య, వైద్యానికి జగనన్న అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పేదలకు ఉచితంగా వైద్యసేవలందించాలన్నదే ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి కార్పొరేట్ ఆస్పత్రుల ద్వారా నాణ్యమైన చికిత్సలందిస్తామని వివరించారు. అందుకే ఆరోగ్యశ్రీ పథకం పరమితిని రూ.5లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ,ఆరోగ్య శ్రీ కార్డుదారులు యాప్ డౌన్ లోడ్ చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నెట్‌వర్క్ ఆస్పత్రులను 800 నుంచి 2,304 పెంచామని, 3,252 రకాల వ్యాధులకు ప్రజలు చికిత్సలు పొందవచ్చని వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంపై మరింత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిలో కనీసం ఒక్కరితో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించాలన్నారు. ఇందుకోసం ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, మహిళా పోలీసులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ప్రతి కార్డులో క్యూఆర్ కోడ్, లబ్ధిదారుడి ఫొటో, కుటుంబ యజమాని పేరు, ఫోన్ నంబర్, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో పొందుపరిచిన వివరాలపై పూర్తి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అరుణాసులోచనాదేవి, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఇస్మాయిల్ (ఫైల్)

పుత్తూరు: వడమాలపేట టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వడమాలపేట పోలీసుల కథనం మేరకు.. పుత్తూరు పట్టణంలోని గేటుపుత్తూరుకు చెందిన ఎం.ఇస్మాయిల్(37) రేణిగుంటలోని అత్తంటికి ఇంటికి మోటర్ సైకిల్ వెళుతున్నాడు. మార్గమధ్యంలో అంజేరమ్మ ఆలయం వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఇస్మాయిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం వెంకటగిరి సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న బాలకృష్ణ (29) అనే వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) చిత్తూరు రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిపిన దాడుల్లో 142 కర్ణాటక మద్యం బాటిళ్లను కలిగి ఉన్న బాలకృష్ణను అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండుకు తరలించారు. ఈ దాడుల్లో ట్రైనీ ఏఈఎస్ శ్రీరామ్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలపై గజరాజుల విధ్వంసం



బంగారుపాళెం: రాగిమానుపెంటలో ఏనుగులు తొక్కేసిన వరిపంటను చూపుతున్న రైతు

బంగారుపాళెం: మండలంలోని రాగిమానుపెంట, కీరమంద, రాళ్లవంక గ్రామాల్లో ఆదివారం రాత్రి పంటలపై ఏనుగులు దాడి చేసి ధ్వంసం చేశాయి. సోమవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతు లు పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. రైతులు వేలు, హుస్సేన్‌కు చెందిన చెరకు, వరి, అరటి పంటలపై ఏనుగులు విధ్వంసం సృష్టించి తీవ్ర నష్టం కలిగించాయి. వారం రోజులుగా ఏనుగులు పంటపొలాలపై దాడి చేస్తున్నాయని రైతులు తెలిపారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై గ్రామాలకు వెళ్లాలంటే కూడా భయంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అటవీశాఖ అధికారులు గజదాడుల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు.

గంటావారిపల్లెలో..

నదుం: మండలంలోని గంటావారిపల్లె పంట పొలాలపై ఆదివారం రాత్రి గజరాజులు విరుచుకుపడ్డాయి. గ్రామానికి చెందిన రైతు వెంకటస్వామికి సుమారు ఎకరా వరి పొలాన్ని తొక్కి తీవ్రంగా నష్ట పరిచాయి. టెంకాయచెట్లు, సపోటా, అరటి చెట్లు నాశనం చేశాయి. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన వెంకటస్వామి పొలం ధ్వంసమై ఉండడం, చెట్లు నాశనమై ఉండడాన్ని గుర్తించాడు. భారీ నష్టం వాటిల్లిందని వాపోయాడు.

సారా ఊట ధ్వంసం



సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసు

గుడిపాల: మండలంలోని రాసనపల్లె అటవీప్రాంతంలో సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఆ ప్రాంతంలో దాడి చేశామన్నారు. పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

అత్తపై కత్తితో అల్లుడి దాడి

గంగాధర నెల్లూరు: అత్తపై అల్లుడు కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొత్తూరుకు చెందిన చిన్నబ్బ బోయడు అదే గ్రామానికి చెందిన అత్తంటికి వెళ్లాడు. డబ్బు, నగలు కావాలని అత్త కృష్ణమ్మ(62)ను అడిగాడు. దీనిపై గొడవ జరగడంతో ఆగ్రహం చెంది ఇంట్లో కూరగాయలు కోసే కత్తితో దాడి చేశాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన మహిళను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిన్నబ్బపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిమాన్వితం..వైకుంఠద్వారం



సమావేశంలో పాల్గొన్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ప్రధాన అర్చకులు, అధికారులు

తిరుమల : శ్రీవారి ఆలయంలోని మహిమాన్విత వైకుంఠద్వారం తెరిచి ఉన్న పదిరోజుల్లో ఎప్పుడు వెళ్లి స్వామిని దర్శించుకున్నా ఒకే ఫలితం ఉంటుందని ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈనెల 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు టోకెన్లు తీసుకున్న భక్తులకు మాత్రమే తిరుమలలో గదులు కేటాయించనున్నట్లు తెలిపారు. అయితే తిరుమలలో గదులు పరిమితంగా ఉన్నందున భక్తులు ఇబ్బంది పడకుండా తిరుపతిలో వసతి పొందాల్సిందిగా కోరారు. వైకుంఠ ద్వార దర్శనార్థం తిరుపతిలోని తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, గోవిందరాజస్వామి సత్రాలు, భూదేవి కాంప్లెక్స్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, జీవకోన హైస్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్, ఎమ్మార్‌పల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఉచితంగా సర్వదర్శన టోకెన్లు పొందవచ్చని వెల్లడించారు. వేణుగోపాల దీక్షితులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లోనే కాకుండా మిగిలిన 8 రోజుల్లో ఎప్పుడు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నా అంతే పవిత్రమని వెల్లడించారు. వివరాలు వారి మాటల్లోనే..

- దేవలోకంలో తెల్లవారుజామున 120 నిమిషాలు అంటే భూలోకంలో 30 రోజులతో సమానం. దీన్నే ధనుర్మాసంగా పిలుస్తున్నాం.
- వేకువజామున బ్రహ్మ ముహూర్తంలో శ్రీమహావిష్ణువు 40 నిమిషాలపాటు దేవతలకు, మహర్షులకు దర్శనమిస్తారు.
- ఇది దేవలోకంలో ఆ కాలమానం ప్రకారం ప్రతిరోజు జరిగే ప్రక్రియ.
- భూలోక కాలమానం ప్రకారం సంవత్సరంలో ఒకసారి జరిగే ప్రక్రియగా కనిపిస్తుంది.
- ఈ 40 నిమిషాలు భూలోకంలో 10 రోజులకు సమానం.
- అందుకే వైష్ణవాలయాల్లో ఈ 10 రోజుల్లో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటే శ్రీమహావిష్ణువును ప్రత్యక్షంగా దర్శనం చేసుకున్న భాగ్యం కలుగుతుందని నమ్మకమని విశదీకరించారు. సమావేశంలో జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్ఓ నరసింహ కిషోర్, శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన గోవిందరాజ దీక్షితులు, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్ కుమార్, సీఏఓ శేషశైలేంద్ర, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.